# ఆధిపత్య రాజకీయాల కారణంగా ఆసియా పసిఫిక్ ప్రాంతంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు

**హిందూ** మహాసముద్రం, ఆసియా – పసిఫిక్ ప్రాంతాల సమస్యలకు సంబంధించి ఇటీవల చైనా, అమెరికాలమధ్య ఉద్రిక్తతలు, పరస్పర ఆరోపణలు ఎక్కువవుతున్నాయి.

**ప్రధాన సమస్యలు :**

1. దక్షిణచైనా సముద్రంలోని కొన్నిదీవులపై పెత్తనంకోసం వివాదం. దక్షిణచైనా సముద్రంలోని అత్యధికభాగంపై చైనా తన సార్వభౌమత్వాన్ని ప్రకటించుకుంటున్నది. ముఖ్యంగా పార్సెల్‌దీవుల సమూహంలోని ఊడి దీవిపై గత 40 సంవత్సరాల నుండి తన పెత్తనాన్ని చలాయిస్తున్నది. దక్షిణచైనా సముద్రంలోని నాన్షా దీవులపై కూడా యిదే విధమైన అధికారాన్ని చలాయిస్తున్నది. చైనా ఇటీవల కాలంలో సముద్రంలోని గుట్టలను కృత్రిమ దీవులుగా మార్చి వాటిని తన రక్షణ అవసరాలకు ఉపయోగిస్తున్నది. ఈ ప్రాంతంలోని తైవాన్, వియత్నాం, ఫిలిప్పీన్స్ లాంటి దేశాలు కూడా ఈ దీవులు తమవే అంటున్నాయి.

ఆవిధంగా చైనా, ఆసియా–పసిఫిక్ దేశాల మధ్య ఇది అనివార్యమైన వివాదంగా వుంది. ఈ వివాదాన్ని చర్చల ద్వారా, ఈ ప్రాంత దేశాలు వాటి చారిత్రక వాస్తవాల ఆధారంగా పరిష్కరించుకో గలగాలి. అలా పరిష్కరించుకోవడానికి తప్పనిసరిగా ప్రయత్నించాలి. కాని అమెరికా, దాని మిత్రదేశమైన జపాన్‌ల ఆధిపత్యం, జోక్యంతో కూడిన రాజకీయాల ఫలితంగా ఈ వివాదం మరింత ముదిరి సంక్లిష్టమవుతోంది. చైనా నుండి ఈ దేశాల హక్కులను కాపాడే రక్షకులుగా అమెరికా, జపాన్‌లు ఈ వివాదంలోకి చొచ్చుకొస్తున్నాయి. చైనాకు, తమకు మధ్యనే ఈ వివాదం వుందా అనే విధంగా దీన్ని మారుస్తున్నాయి.

2. రెండవ ప్రపంచయుద్ధ కాలంలో, తదనంతర పరిణామాలలో అమెరికా, జపాన్ సామ్రాజ్యవాదులు అనుసరించిన దురాక్రమణ రాజకీయాలు, సాగించిన సైనిక ఆక్రమణలు, పునర్విభజనలే ఉత్తర, దక్షిణకొరియాల మధ్య సమస్యలకు మూలం. సామ్రాజ్యవాదులు చేసిన అన్యాయాలు సరిదిద్దబడాలనీ, తిరిగి రెండు దేశాలూ శాంతియుతంగా ఐక్యంకావాలని, యిరు దేశాల ప్రజలు ప్రగాఢంగా కోరుకుంటున్నారు. కానీ దశాబ్దాలు గడుస్తున్నా ఆ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోగా మరింత పెంచిపోషించబడ్తున్నాయి.

జపాన్‌పై బాంబుదాడులు చేయడంద్వారా రెండవ ప్రపంచయుద్ధంలో విజేతలుగా మారిన అనంతరం అమెరికా సామ్రాజ్యవాదం, క్రూరమైన ఆధిపత్య కాంక్షలతో ముందుకొచ్చింది. సైనిక పరమైన రక్షణ కల్పించడంపేర దక్షిణకొరియా, జపాన్‌లలో మిలటరీ స్థావరాలను ఏర్పాటుచేసుకొని చైనా, కొరియా వివాదాలలో జోక్యం చేసుకోవడం ద్వారా ఆసియాలోకి చొచ్చుకు వచ్చింది. ఒకవైపు దక్షిణ కొరియా పాలకులకు అధునాతనమైన, కొత్త కొత్త ఆయుధాలను అందిస్తూ మరోవైపు ఉత్తర కొరియా కొత్త ఆయుధాల తయారీ ప్రయత్నాలపై అభ్యంతరాలను ప్రకటిస్తూ, పరిమితులు విధిస్తూ, వానివల్లే దక్షిణకొరియాతోబాటు మొత్తం ఆసియా పసిఫిక్ ప్రాంత శాంతి, స్థిరత్వం, భద్రతలకు ప్రమాదం ముంచుకొస్తున్నట్లు అమెరికా సామ్రాజ్యవాదం గగ్గోలు పెడ్తున్నది. అమెరికా సామ్రాజ్యవాదం, దాని మిత్ర పక్షమైన జపాన్‌లు – కొరియా సంక్షోభం సమిసిపోకుండా చూడడానికి, దీన్ని సాకుగా చూపి ఆసియా, ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో తమ జోక్యాన్ని సమర్థించుకోవడానికి, తమ ఆధిపత్య రాజకీయాలను కొనసాగించు కోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

ఉత్తరకొరియా ముఖప్రాంగణం వద్ద థాడ్ (Terminal High Altitude Area Defence) అనే క్షిపణి నిర్మూలనవ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలుస్తున్నది. థాడ్ వ్యవస్థలోని రాడార్ పరిధి 1000 కి.మీ వుంటుందని విశ్లేషకులు చెపుతున్నారు. థాడ్ మిసైల్ ఒక్కొక్కదాని ఖరీదు 130 కోట్ల డాలర్లు వుంటుంది. అది దక్షిణకొరియా యొక్క ఆకాశ ప్రాంతంలో సగంనుండి రెండింట మూడొంతుల ప్రాంతానికి రక్షణ వలయంగా వుండగలదు. దాన్ని ఏర్పాటుచేసిన స్థలాన్నిబట్టి అది సునాయాసంగా చైనా ఆకాశప్రాంతాన్ని పరిశీలించి చైనా ప్రయోగించే బాలిస్టిక్ క్షిపణులను ఎదుర్కొని నిర్వీర్యం చెయ్యగలదు. 2016లో ఉత్తరకొరియా అణుపరీక్ష నిర్వహించి నందున థాడ్ వ్యవస్థను ఏర్పాటు చేయవలసి వచ్చిందని, ఇది దక్షిణకొరియాలో వున్న తన 27000 సైన్య రక్షణకు అవసరమని అమెరికా వాదన.

అమెరికా ప్రతిపాదిస్తున్న ఈ థాడ్ క్షిపణి వ్యవస్థపై చైనా తీవ్ర అభ్యంతరాలను లేవనెత్తుతోంది. ఈ క్షిపణి వ్యవస్థ చైనాయొక్క కీలకయుద్ధ వ్యూహాలకు, భద్రతా ప్రయోజనాలకు నేరుగా విఘాతం కలిగిస్తుందని చైనా అంటుంది. అంతేగాక దీనివల్ల ఈశాన్య ఆసియా మరియు ఆసియా పసిఫిక్ ప్రాంతాలలో భద్రతాపరంగా అసమతుల్యతలు ఏర్పడతాయనీ, ఫలితంగా విస్తృతపరిధిలో తిరిగి సైనిక సమతుల్యత సాధనకు యుద్ధాలు జరిగే అవకాశం వుందని చైనా వాదిస్తోంది. అణుపరీక్ష అంశాన్ని ఒక సాకుగా చూపి థాడ్ వ్యవస్థ స్థాపనపై మామూలు చర్చలు కూడా జరగనీయకుండా అమెరికా అడ్డుపడ్తోందని చైనా విమర్శిస్తోంది.

'అమెరికా–దక్షిణకొరియా పరస్పర రక్షణ ఒప్పందం' పై ఆ రెండు దేశాలు సంతకం చెయ్యడం ద్వారా ద్వీపకల్ప భద్రతకు అమెరికా ముప్పు కల్గిస్తుందనీ, ఇది విస్తృతస్థాయిలో ఈశాన్య ఆసియా, ఆసియా పసిఫిక్ ప్రాంతమంతా వ్యాపిస్తుందని చైనా విమర్శిస్తోంది. అమెరికా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తుందని చైనా ఆరోపిస్తోంది. ఒకవైపు అమెరికా ఉత్తరకొరియాపై తీవ్ర ఒత్తిడిని కలుగజేస్తోంది. కానీ మరోవైపు దక్షిణకొరియా భద్రతకు పూర్తిస్థాయిలో పూచీనిస్తుంది. ఇలాంటి చర్యలు ఏవిధంగానూ ఉద్రిక్తతలను నివారించవని చైనా ఆరోపణ.

చైనా, అమెరికాల ప్రవేశంతో ఆసియా, ఆసియా పసిఫిక్ ప్రాంతాలకు సంబంధించిన పెద్ద సమస్యలో కొరియన్ సంక్షోభం ఒక భాగంగా చేయబడింది. అమెరికా, చైనాలు ఈ అంశాన్ని తమ మధ్యపోరుకు సంబంధించిన అంశంగా మార్చి, కొరియా ప్రజలను యిరుపక్షాలలోకి నెడ్తూ తమ సమస్యను పరిష్కరించుకునే చొరవనుగానీ, స్వేచ్ఛనుగానీ వారు ప్రదర్శించే పరిస్థితి లేకుండా కేవలం వారిని ప్రేక్షకులుగా వుండే పరిస్థితులను కల్పిస్తున్నాయి.

3. నాన్షా దీవుల వివాదంపై జోక్యం చేసుకోనని చెబుతున్నప్పటికీ అమెరికా మాటలు, చేతలు అది ఉద్రిక్తతలను రెచ్చగొడ్తుందని భావించవలసివస్తున్నదని చైనా అంటోంది. అమెరికా ఉద్దేశ్యాలు ప్రశ్నార్థకంగా వున్నాయనేది చైనా అభిప్రాయం. "ప్రాంతీయ భద్రతాకల్పన"లో భాగస్వామినవుతానని, నాన్షా దీవులను సంయుక్తంగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నించే పాత్రను తీసుకుంటానని చైనా అంటోంది. అయితే ఆ దీవులపై తన సార్వభౌమత్వాన్ని వదులు కోకుండా అయితేనే ఈ పాత్ర నిర్వర్తిస్తానంటుంది.

చైనా ఇంకో విమర్శకూడా చేస్తుంది. "ఆసియా కీలు" ఒప్పందంతో అమెరికా, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఒక నావికా స్థావరాన్ని నిర్మిస్తోంది. ఈ స్థావరం అమెరికాకు తన 70శాతం నావికా దళాల్ని ఆసియా పసిఫిక్ ప్రాంతంలో మోహరించడానికి వీలు కల్పిస్తుంది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఉద్రిక్తతలకు యిదే మూలకారణం".

అయినా అమెరికా ఈ ప్రాంతంలో తన ప్రణాళికలతో ముందుకెళ్తూనే వుంది. సముద్ర మార్గాలను ప్రయాణమార్గాలుగా ఉపయోగించే దేశాల హక్కులను కాపాడే "రక్షకులు"గా తన్ను తాను ప్రకటించుకుంది. ఆసియా, ఆసియా పసిఫిక్ ప్రాంతంపై తన ఆధిపత్యాన్ని రుద్దడానికి కావలసిన కీలక సైనిక డిజైన్లను అమలుచేయడంలో తలమునకలయి వుందని ప్రతి ఒక్కరూ స్పష్టత కలిగివుండాలి. ఈ ప్రాంతంలోని దేశాలకున్న సముద్ర మార్గాల ద్వారా ప్రయాణం చేసే హక్కును పరిరక్షించేవానిగా తనను తాను నియమించుకోవడం అమెరికా తన సైనిక ప్రణాళికలను అమలుచేయడం కోసమే. ముందుగా దాని రక్షణకోరే దేశాలపై 'పరిరక్షకుడు'గా తన ఆధిపత్యాన్ని రుద్దుతుంది. అమెరికా పట్టులోకి రావడానికి నిరాకరించే దేశాల హక్కులను కాలరాచి, వాటిని తన అధీనంలోకి తెచ్చుకుంటుంది. చివరకు తన రాజకీయ జోక్యానికి, యుద్ధానికి, ఆధిపత్యానికి అత్యంత అనుకూలమైన రణస్థలంగా ఆ మొత్తం ప్రాంతాన్ని మలుచుకుంటుంది. కాబట్టి ఈ ప్రాంతంలోకి అమెరికాను తమ రక్షకునిగా ఆహ్వానించే లేక ఆమోదించే దేశాలు వాటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, హక్కులను పణంగా పెట్టడమేకాకుండా ఆసియా మరియు ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అమెరికా ఆధిపత్య స్థానానికి తెలిసో తెలియకో ఒక సాధనంగా దోహదపడటమే అవుతుంది.

ఆసియా మరియు ఆసియాపసిఫిక్ ప్రాంతంలో అమెరికా, చైనాను ఒక శక్తివంతమైన విరోధిగా చూస్తుంది. ఈ ప్రాంతంపై తన నాయకత్వాన్ని సుస్థిరంచేసుకునే మార్గంలో చైనా తీవ్ర అడ్డంకిగా మారవచ్చని అమెరికా భయపడుతోంది. కాబట్టి ఈ ప్రాంతంపై తన పట్టును సాధించుకోవడానికి చైనాను ఆర్థికంగా, సైనికంగా నిరోధించడం, చైనా యుద్ధ ప్రయోజనాలను నీరుగార్చడం, చైనాకు వ్యతిరేకంగా ఈ ప్రాంత దేశాలను నిలబెట్టడం చేస్తూనే తన చొరబాట్లు, జోక్యం చేసుకోవడం, సముద్ర మార్గాల పహారాను పటిష్టంచేసుకోవడం అమెరికా ఎత్తుగడలలో భాగంగా వుంటాయి.

విదేశీ దాడులు, ఆక్రమణలనుండి తనను తాను రక్షించుకునేందుకు సన్నాహాలు చేసుకునే హక్కు చైనాకు వుంది. దక్షిణచైనా సముద్రంలోని నిర్దిష్ట దీవులపై చైనాకు అన్నివిధాల చట్టబద్ధమైన హక్కులున్నాయి. అదే సందర్భంలో చారిత్రక వాస్తవాల ద్వారా పోటీకి వస్తున్న దేశాలతో సముచితమైన, హేతుబద్ధమైన వాదనలద్వారా, సంప్రదింపులద్వారా విదేశీ జోక్యానికి తావులేకుండా చైనా తనకున్న చట్టబద్ధ హక్కులను కాపాడుకునే స్థితిలో వుండాలి.

చట్టబద్ధ కార్యక్రమాలకు సముద్ర మార్గాలను ఉపయోగించుకునే హక్కు విషయానికి వస్తే దాన్ని అంతర్జాతీయ నియమాల ఆధారంతో, సాధారణ అంగీకారం వున్న నియమాలు, నిబంధనల ఆధారంగా, తీరప్రాంత దేశాల హక్కులను అతిక్రమించకుండా, శాంతికి విఘాతం కలగకుండా, ఆధిపత్యానికి, యుద్ధానికి ఆ ప్రాంతాన్ని వివాదాస్పద ప్రాంతంగా మార్చకుండా ఆ హక్కులను నిర్ణయించాలి. అలా కాకుండా ఒక దేశం ఆ ప్రాంత భద్రతా రక్షకునిగా వ్యవహరించడమో లేక కొన్ని దేశాల సమూహానికి స్వేచ్ఛా

సముద్ర మార్గాలకు హామీనిచ్చేవానిగా బాధ్యత తీసుకొని వ్యవహరించే విధానం ఎట్టి పరిస్తితులలోనూ అనుసరణీయంకాదు. ఈ విధానం ఆ ప్రాంతంలోని దేశాల, ప్రజల భద్రతను, స్వేచ్ఛను పోగొట్టుకోవడానికే బీజాలు వేస్తుంది.

4. ఆసియా మరియు ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన సైనిక మిత్రకూటమి, అమెరికా నాయకత్వాన క్రియాశీలకంగా వుంది. భారతదేశాన్ని కూడా ఇందులోకి లాగారు. ఇది అమెరికా ఆధిపత్యానికి ఒక పనిముట్టేనన్నది స్పష్టం. నరేంద్రమోడీ నాయకత్వాన భారత ప్రభుత్వం, ఈ మైత్రి కూటమితోబాటు తన కార్యక్రమాల ద్వారా చాలదూరం ప్రయాణించింది. 2016 ఫిబ్రవరి 7న అంతర్జాతీయ నౌకాదళ విన్యాసాలు – 2016 సందర్భంగా విశాఖపట్నంలో నరేంద్రమోడీ ప్రసంగిస్తూ "హిందూమహాసముద్ర ప్రాంతం మా విధానాలలో అత్యంత ప్రముఖమైనది. 'సాగర దర్శనం'లో మన మార్గాన్ని స్పష్టపరచడమైనది. సాగర్ అంటే మహాసముద్రం అని అర్ధం. అంతేగాక ఈ పదంలోని ఆంగ్ల అక్షరాలు ఈ ప్రాంతంలోని అందరికీ భద్రత, వృద్ధిని సూచిస్తాయి. సముద్రాలలో ప్రత్యేకించి హిందూమహాసముద్రంలో మేము మా భౌగోళిక – రాజకీయ, సైనిక మరియు ఆర్థిక ప్రయోజనాలను పొందడానికి, మెరుగుపరచుకోడానికి మా పనిని కొనసాగిస్తాము" అని అన్నారు. భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ కూడా అదేరోజు విశాఖపట్నంలో చాల స్పష్టంగా చెప్పారు. భారతదేశం తన నౌకాదళ విధానాన్ని పునర్నిర్మించుకోవడం ద్వారా మహాసముద్రాల సుస్థిరతను మెరుగుపరచడానికి గణనీయంగా ఇతర దేశాలతో సహకార చర్యలు చేపట్టిందన్నారు. హిందూమహాసముద్రంలోని పెద్ద నౌకామార్గాలపై భారతదేశం యొక్క భౌగోళిక స్థానం, నౌకా రంగంలో ప్రముఖపాత్ర పోషించే అవకాశాన్నిచ్చింది. భారత నౌకాదళం, హిందూ మహాసముద్రమంతటా వున్న సముద్ర సమాచార ప్రసారాల మార్గాల భద్రత కల్పించే విషయంలో ప్రముఖపాత్ర వహించనుంది. భారత పాలకులు, ఈ వ్యూహాత్మక సైనిక కూటమిలో భాగస్వాములవడం ద్వారా భారతదేశాన్ని అమెరికా ఆధిపత్య రధానికి కట్టివేశారు. దీనివల్ల వీరు చెప్పుకునే "కీలక నౌకా రంగపాత్ర", "ప్రధాన పాత్ర"లు అమెరికా ఆధిపత్య ప్రయోజనాలకోసం అది నిర్దేశించే విధానాలను అమలు చేయడానికి తప్ప మరేమీ కాదని స్పష్టమౌతోంది.

అమెరికా సామ్రాజ్యవాదులు తమ పథకాల్లోకి భారతదేశాన్ని పీకల్లోతుగా దించడానికి వేగంగా కదులుతున్నారు. అమెరికా పసిఫిక్ కమాండర్ అడ్మిరల్ హ్యారీ బి.హారిస్ ఇండోపసిఫిక్ ప్రాంతంలో జరుగుతున్న అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాల సంయుక్త నావికా గస్తీలలో పాలుపంచుకొమ్మని, భారతదేశంపై తీవ్రంగా ఒత్తిడి తీసుకువస్తున్నాడు. "మనం కలసి విన్యాసాలు చేయాలి. ఈ విన్యాసాలను సమన్వయ కార్యక్రమాలలోకి మార్చుకోవాలని" హ్యారి ప్రతిపాదిస్తున్నాడు. అతను యింకా యిలా ఆశాభావాన్ని వ్యక్తపరిచాడు. "అన్ని దేశాలు స్వేచ్ఛగా సముద్రాలనుపయోగించుకునేందుకు మనం కలసి పనిచేయాలనీ, సమీపభవిష్యత్తులోనే అమెరికా, భారత్ యుద్ధనౌకలు కలసి ప్రయాణం చేయాలనీ, ఈ దృశ్యం అందరూ ఆహ్వానించే సర్వసాధారణ విషయంగా వుండాల"న్నాడు.

అమెరికా నాయకత్వాన వున్న సైనికకూటమికి భారత్‌ను కట్టివేయడం, కేవలం ఆసియా, ఆసియా – పసిఫిక్ ప్రాంతంలో అమెరికా నాయకత్వ స్థాపనకు ఉద్దేశించబడినదే. ఈ ప్రమాదకరమైన జూదంలో భారత పాలకులు పావులుగా వుంటారు. ఈ సైనిక ఎత్తుగడ చైనాను ప్రధాన లక్ష్యం చేయడానికే అనే విషయం చైనాతో సహ అందరికీ తెలుసు. 'ఆసియా కీలు' అనబడే ఈ సిద్ధాంతంలో భారత్‌ను ప్రధానపాత్రధారి చేస్తారు. ఈ పరిస్థితి భారతదేశ ప్రజల మెడకు ఉచ్చు బిగించడమేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఈ దెబ్బతో మనదేశం, దేశ ప్రజల ప్రయోజనాలకోసం, ఆసియా, ఆసియా పసిఫిక్ ప్రాంత శాంతికి, ప్రజల భద్రతకు భంగం కలగకుండా ఇతర దేశాలతో మన సంబంధాలను నిర్ణయించుకునే స్వేచ్ఛను, హక్కును కోల్పోతాము. పైగా ఈ ఒప్పందం మనలను సామ్రాజ్యవాదులు, ఆధిపత్యశక్తులు ఆడమన్నట్లు ఆడేవిధంగా మనపై ఒత్తిడి తెస్తుంది.

ఈ మొత్తం ప్రాంతాన్ని సామ్రాజ్యవాదులు, తమ జోక్యందారీ రాజకీయాలకు, ముఠాతత్వానికి, ఆధిపత్యానికి ఆలవాలంగా చేసుకునే ప్రయత్నాలను – ఆసియా, ఆసియాపసిఫిక్ ప్రాంతంలోని సమస్త ప్రజానీకం, ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను, శాంతిని కోరే శక్తులు చైతన్యవంతంగా, సమైక్యంగా ఎదుర్కోవడం ద్వారా మాత్రమే వమ్ముచేయగలవు.

oooooo